రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

- అధ్వానంగా జాతీయ రహదారి
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

గుంతకల్లు: పట్టణం మీదుగా వెళ్తున్న అంకోలా–నెల్లూరు జాతీయ రహదారి అధ్వానంగా మారింది. పట్టణ శివారులోని రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి నుంచి తిమ్మాపురం గ్రామం వరకూ ఈ ప్రధాన రహదారి అడగుకో గుంత అన్న చందంగా తయారైంది. వాహనాలు నడపాలంటే నరకం కనపడుతోందని ప్రజలు వాపోతున్నారు. అధ్వాన రహదారి వల్ల వాహనాలు కూడా దెబ్బతింటున్నాయన్నారు. గుంతలు పడిన రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ఇటీవల వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. వాహనాదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదమరిస్తే అపాయమే

తాడిపత్రిటౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు తాడిపత్రి మండలంలోని పలు రహదారులు కొట్టుకుపోవడంతో అధ్వానంగా మారాయి. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణాలు పోయే ప్రమాదముందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దిగువపల్లి సమీపంలో మట్టి కట్టలు కొట్టుకుపోవడంతో కల్వర్టు బలహీనంగా మారింది. దీంతో ఏక్షణమైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అలాగే రోడ్డు పొడవునా మోకాలు లోతు గోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నాని, ప్రయాణమంటే నరకం కనిపిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఆలూరు గ్రామం మీదుగా బోడాయిపల్లి, వెలమకూరు గ్రామాలకు వెళ్లే రహదారి సైతం వర్షం నీటికి కొట్టుకు పోవడంతో.. రోడ్డు ఓ వైపు బలహీనంగా మారింది. దీంతో గ్రామస్తులు అటు వైపు వాహనాలు వెళ్లకుండా రాళ్లను అడ్డుపెట్టారు.. రోడ్లు అధ్వానంగా మారినా అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ స్పందించక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


గుంతకల్లు: ఏసీఎస్ మిల్లు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఏర్పడిన గుంత


తాడిపత్రిటౌన్: దిగువపల్లి సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు


గుంతకల్లు: పారిశ్రామిక వాడ సమీపంలో రోడ్డు దుస్థితి


గుంతకల్లు: పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై గుంతలు


తాడిపత్రి టౌన్: బోడాయిపల్లి సమీపంలో దెబ్బతిన్న రోడ్డు

‘అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోండి’

గుంతకల్లు రూరల్: నాణ్యత లేని రోడ్లను నిర్మించిన కాంట్రాక్టర్లు, అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్మ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ గుంతకల్లు పట్టణం నుంచి మండలంలోని దోనిముక్కల,మల్లేనిపల్లి, పులగుట్టపల్లి, నెలగొండ, నాగసముద్రం, కదిరిపల్లి, అయ్యవారుపల్లి గ్రామాలను కలుపుతూ పామిడి వరకూ ఉన్న రహదారిలో అక్కడక్కడ ఉన్న గుంతలను పూడుస్తూ ప్యాచ్ వర్క్ చేయించారన్నారు. కానీ నెలరోజులు గడవక ముందే రోడ్డు మళ్లీ గుంతల మయంగా మారిందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. వెంటనే విచారణ జరిపించి అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుంతకల్లు: స్థానిక సరోజినీనాయుడు మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం శక్తి యాప్ డౌన్లోడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి టీం ఇన్‌చార్జ్, ఏఎస్‌ఐ ఎం.పద్మావతి మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలకు రక్షణగా నిలుస్తుందన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్గిండాలన్నారు. సెల్ ఫోన్‌లో మీ ఫోటోలను వాట్సప్ డీపీ పెట్టుకోవడం, ఇన్‌స్టాగామ్‌లో రీల్స్ వల్ల జరిగే అనర్థాలను వివరించారు. సైబర్ నేరాలు, ఏటీఎం మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫేక్ కాల్స్, ఓటీపీలు, డియల్ 100,112, 1098,181 నంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళ కానిస్టేబుల్ మణెమ్మ, కానిస్టేబుల్ షఫివుల్లా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ‘భాగవత సప్తాహం’


ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: మండలంలోని బొందలదిన్నె గ్రామంలో శుక్రవారం వైభవంగా భాగవత సప్తాహ కార్యక్రమం ముగిసింది. తిక్కయ్యస్వామి భాగవతం భక్త సమాజం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో హన్సికారెడ్డి పాడిన భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తీగెల నారాయణరెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, ప్రహ్లాదరెడ్డి, నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వివాహిత ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న రామలక్ష్మి

గుత్తి: పట్టణానికి చెందిన వివాహిత రామలక్ష్మి అనే శుక్రవారం విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఆమె అఘాయిత్యానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి మరొకరు..

తుగ్గలి మండలం బాట తండాకు చెందిన వివాహిత మల్లేశ్వరి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు ఆటోలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


మల్లేశ్వరి

యూరియా కోసం రైతుల పాట్లు

శింగనమల: సాగు చేసిన పంటలకు యూరియా అవసరం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఫర్టిలైజర్ షాపులు, రైతు సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా అందుబాటులో లేకుండా పోతోంది. శనివారం శింగనమల మండలానికి సంబంధించి వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి ఒక లోడు (280 బస్తాలు) యూరియా రావడంతో రైతులు తరలివచ్చారు. యూరియా వచ్చిన నాలుగు గంటల లోపే అయిపోవడంతో.. యూరియా దొరక్క కొందరు రైతులు వెనుతిరిగారు. మండలంలో కల్లుమడి, తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, ఉల్లికల్లు, కొరివిపల్లి, జూలకాల్వ, పి.జలాలపురం, గురుగుంట్ల, చీలేపల్లి, శింగనమల, గోవిందరాయునిపేట, సోదనపల్లి , శివపురం, సి.బండమీదపల్లి, పోతురాజుకాల్వ గ్రామాలకు చెందిన రైతులు బోర్ల కింద వరి పంట సాగు చేశారు. ఆయా గ్రామాలకు ఒక టన్ను యూరియా అవసరం అవుతుందని రైతులంటున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి యూరియాను కొరత లేకుండా చూడాలని కోరారు. వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్ మాట్లాడుతూ రాచేపల్లి, ఉల్లికల్లు, కొరివిపల్లి రైతు సేవా కేంద్రాలకు యూరియా కోసం ఇండెంట్ పెట్టామని, త్వరలో వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.


శింగనమల సింగిల్ విండో కార్యాలయంలో యూరియాతీసుకుంటున్న రైతులు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

శింగనమల: వరి సాగులో సస్య రక్షణ పద్ధతులు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని రైతు శిక్షణ వ్యవసాయాధికారి నరసింహులు సూచించారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద బీపీటీ 2846 రకం వరి ఫౌండేషన్ సీడ్‌పై మండలంలోని రాచేపల్లిలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీపీటీ రకం వరి అగ్గి తెగులు, సుడి దోమను తట్టుకుంటుదన్నారు. పంట కాలం 145 రోజులన్నారు. వరి పొలంలో తూర్పు, పడమర దిశలో రెండు మీటర్లకు ఒక అడుగు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా గాలి, వెలుతురు బాగా తగిలి పురుగు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందన్నారు. సుడి దోమ నివారణకు ఎకరాకు కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు 10 కిలోలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ అన్వేష్‌కుమార్, వీహెచ్‌ఏ రమేష్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న రైతు శిక్షణ వ్యవసాయాధికారి నరసింహులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

యాడికి: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని రెడ్డిపల్లిలోని కీటక సంబంద కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్ సూచించారు. మండలంలోని చందన గ్రామ సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) సహకారంతో ఏఓ మహబూబ్‌బాషా మొక్క జొన్న పంటపై అహగాహన సదస్సు నిర్వహించారు. కత్తెర పురుగు నివారణకు మొక్కజొన్న పొలం చుట్టూ కలుపు లేకుండా, పంట మార్పిడి, పాటించటం, పురుగు మందులు, వేప నూనెను వాడాలన్నారు. ఎసిటామి ప్రిడ్, క్లోరంట్రా నీలిప్రోల్‌తో పాటు వేపనూనెతో కత్తెర పురుగును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కీటక సంబంద శాస్త్ర వేత్త కిశోర్, వీహెచ్‌ఏ ఆదిలక్ష్మి, గ్రామ రైతులు పాల్గొన్నారు.


పెద్దవడుగూరులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త కిశోర్

లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

పెద్దవడుగూరు: పత్తి పంట సాగు చేసిన రైతులు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ మునికృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆత్మ సౌజన్యంతో భూసార పరీక్షలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా రైతులు రసాయన, సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. పత్తి పంటలో గులాబీరంగు పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఎకరానికి 16 నుంచి 20 బుట్టలు బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు , వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పెద్దవడుగూరు: జిల్లాలోని పట్రా కులానికి చెందిన అంధ, మూగ, చెవుడు విద్యార్థులకు ఈ నెల 27న పట్రా కుల వన్నూరమ్మ వర్ధంతి సందర్భంగా ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు రిటైర్డ్ వార్డెన్ బసవరాజు తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పుట్టుకతో చెవుడు, మూగ, అంధులై ఉండి ఒకటో తరగతి నుంచి పీజీ విద్యార్థులు జత దుస్తులు, 5 వేలు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. వివరాలకు 9949166160 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఉమాదేవి

బుక్కరాయసముద్రం: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫర్టిలైజర్ దుకాణదారులను జిల్లా ఉద్యానశాఖ డీడీ డి.ఉమాదేవి హెచ్చరించారు. బుక్కరాయసముద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రెడ్డిపల్లి, దయ్యాలకుంటపల్లి గ్రామాల్లోని షాపుల్లో యూరియా నిల్వలు గుర్తించారు. ఈ పాస్ ఆధారంగా గోడోన్‌లలో నిల్వ ఉన్న స్టాకును తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. విక్రయించిన మందులకు బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరులో అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న చిన్నవడుగూరుకు చెందిన హనుమంతు అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 96 ఓల్డ్ అడ్మిరల్ క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో జమీదారులు మోహన్, ఓబుళపతి, హోమ్ గార్డు లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ‘బీమా’ చేయించుకోవాలి


మాట్లాడుతున్న ప్రాంతీయ మేనేజర్ శ్రీదేవి

బుక్కరాయసముద్రం: ప్రతిఒక్కరూ జీవిత బీమా చేయించుకోవాలని గ్రామీణ బ్యాంక్ అనంతపురం ప్రాంతీయ మేనేజర్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని పసులూరు గ్రామంలో జన సురక్షా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవిత బీమా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన (పీఎంజేబీవై), ప్రధాన మంత్రి సురక్షా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన వంటి సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బీకేఎస్ ఏపీజీబీ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేష్ బ్యాంక్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా దివ్యాంగ పింఛన్ పొందుతూ.. ఇటీవల రద్దైన ప్రతి ఒక్కరూ ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఇటీవల జారీచేసిన నోటీసుతో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ శకుంతల సూచించారు. మండల వ్యాప్తంగా 463 మందికి సచివాలయాల ద్వారా నోటీసులు పంపిణీ చేశామన్నారు. డబ్బులిస్తే తిరిగి పింఛన్ వచ్చేలా చేస్తామని చెప్పే వారి మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. అర్హులైతే తప్పక పింఛన్ మంజూరు చేస్తామన్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా పింఛన్లు 7,813 ఉండగా.. అందులో 115 మందిని అనర్హులుగా గుర్తించారని ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ మాట్లాడుతూ ఇప్పటికే 110 మంది ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. మిగిలిన వారు కూడా దరఖాస్తు చేసుకుంటే, అర్హులందరికీ పింఛన్ వచ్చేలా చూస్తామన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి


బ్రాహ్మణపల్లెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ శివగంగాధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లెలో ఆయన సిబ్బందితో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇరువర్గాల ఇళ్లు, గడ్డివాముల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధరణిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల వివరాలను తమ వద్ద నమోదు చేసుకోవాలని వినాయక ఉత్సవ కేంద్ర కమిటీ గౌరవ సలహాదారుడు పీవీ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవరాత్రులు, నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించడానికి కమిటీ పేర్లు, విగ్రహాల ఎత్తు, ఏర్పాటు చేసే ప్రాంతాల వివరాలను అందజేయాలన్నారు.

గాజుల అలంకరణలో వాసవీ మాత

గుంతకల్లు: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారు గాజుల అంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేకువజామునే వాసవీమాత మూలవిరాట్‌కు అభిషేకం గావించి వివిధ రకాల గాజులతో అందగా ముస్తాబుచేశారు. అనంతరం ప్రత్యేక పూజాలు గావించారు. వందలాది మంది భక్తాదులు అమ్మవారిని దర్శంచుకుని మొక్కులు తీర్చుకున్నారు.

యాడికి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో మూలవిరాట్‌ను శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మహిళలు రకరకాల గాజులతో అలంకరించారు. కార్యక్రమంలో భూపాలం కేధార్ నాథ్, ఆదిత్య పవన్, జీఎస్‌టీ రవి, మద్దాల విశ్వనాథ్, జయవరం చంద్ర శేఖర్, బంగారు బలరామయ్య పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: చివరి శ్రావణమాస శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సంజీవనగర్‌లోని వేదగాయత్రి మాత వెండి కవచం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


గుంతకల్లులో వాసవీమాత


యాడికిలో కన్యకా పరమేశ్వరి


తాడిపత్రిలో వేదగాయత్రిమాత


పామిడిలో వాసవీ మాత

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ అలయం, ఇతర అమ్మవారి ఆలయాలు, గృహాల్లో శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాతృమండలి ఆధ్వర్యంలో పూజలు చేశారు. మంగళహారతి అనంతరం భక్తాదులకు ప్రసాద వితరణ గావించారు.

క్లుప్తంగా

కసాపురంలో సామూహిక వరలక్ష్మి వ్రతం


వ్రతం ఆచరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో లక్ష్మీదేవి అమ్మవారిని కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలతో కలిసి సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈఓ ఎం.విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ పూజా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు


కృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక నాగసముద్రం కమిటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా మండలంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు నాగసముద్రం గ్రామంలో శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకీలో కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు పుట్లూరులో పర్యటించనున్న కలెక్టర్

పుట్లూరు: మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించే స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొననున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుత్తి: విద్యా రంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను గుత్తిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థుల పీజీ విద్యకు ఆటంకంగా మారిన జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. విద్యా రంగ సమస్యలన్నింటినీ పరిష్కారం చేయాలనే ప్రధాన డిమాండ్ సాధన కోసం చలో కలెక్టరేట్ కార్యక్రమం తలపెట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల జగద్గురుమఠంలో రేపు పూజలు

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని శ్రీశైల జగద్గురు మఠంలో ఆదివారం జగద్గురు నాగలూటి శివాచార్య మహాస్వాముల వారి 85వ మహాగణారాధన సందర్భంగా లింగధారణ, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మఠం మేనేజర్ మల్లప్ప శుక్రవారం తెలిపారు. శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి హాజరై భక్తులకు ఆశీర్వచనం అందజేస్తారన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


తరిమెలలో బస్టాండ్ వద్ద రోడ్డుకు మట్టి తోలించి చదును చేయిస్తున్న దృశ్యం

శింగనమల: మండలంలోని తరిమెల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో మెయిన్ రోడ్డు గుంతల మయంగా మారింది. ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతుండడంతో సర్పంచ్ ఓబిలేసు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికీ తీసుకెళ్లారు. వారి అనుమతితో పంచాయతీ నిధులతో శుక్రవారం ఎర్రమట్టిని తోలించి, చదును చేయించారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.